సాక్షి
అనంతపురం

సోమవారం । 19 । జూన్ । 2023



ఆర్యవైశ్య నాయకుడి దుర్మరణం

రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు జయం పురుషోత్తం దుర్మరణం చెందాడు.

II లో



ఆర్ట్స్ కళాశాల కీర్తి.. ప్రపంచ వ్యాప్తి

రాష్ట్రంలోనే అత్యధిక కోర్సులు కలిగిన ఏకైక కళాశాలగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల కీర్తి గడించింది.

II లో

గరిష్టం/కనిష్టం

39.1°/24.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఎంఈఓ-2 పోస్టుల కౌన్సెలింగ్ ప్రశాంతం

- 58 మండలాలను కోరుకున్న అభ్యర్థులు
- అమరాపురం, గుడిబండ, అగళి, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ పెండింగ్



కౌన్సెలింగ్ దృశ్యం

రాప్తాడురూరల్: మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)-2 పోస్టుల భర్తీకి నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆదివారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓ-2 పోస్టులకు డీఈఓ సాయిరామ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా దాదాపు 400 మంది హెచ్‌ఎంలతో సీనియార్టీ జాబితా తయారు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రాత్రి 9 గంటలకు ముగిసింది. 63 మండలాలకు గాను 58 మండలాలను అభ్యర్థులు కోరుకున్నారు. అమరాపురం, గుడిబండ, అగళి, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలు పెండింగ్ పడ్డాయి. తర్వాత సీనియార్టీ జాబితా తయారు చేసి ఈ ఐదు మండలాలను కూడా భర్తీ చేస్తామని డీఈఓ తెలిపారు. ఎంఈఓ-2 పోస్టుల్లో నియామకం పొందిన వారందరూ సోమవారం విధుల్లో చేరాల్సి ఉంటుందని చెప్పారు. కౌన్సెలింగ్‌లో విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య, డీవైఈఓ పద్మప్రియ, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, శ్రీనాథ్, సరళ, ఏపీఓలు నాగరాజు, మారుతి, ఏఎస్ఓ ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ హర్షం: జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించి ఎంఈఓ-2 పోస్టులను మంజూరు చేసి, భర్తీకి చర్యలు తీసుకోవడంపై వైఎస్సార్‌టీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద రెడ్డి, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, రమణ, విశ్వనాథ్ ఓబిరెడ్డి, రవీంద్రారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

24 వరకు ఒంటిపూట బడులే

- ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు



రాప్తాడురూరల్: ఎండల తీవ్రత దృష్ట్యా విద్యాశాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 24 వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఒంటిపూట బడులే నిర్వహించాలని పేర్కొంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆదివారం రాత్రి పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ జారీ చేశారు. డీఈఓ సాయిరామ్ మాట్లాడుతూ ఎండలు భగ్గుమంటుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం మరోవారం రోజుల పాటు ఒంటిపూట బడులు కొనసాగించేలా చర్యలు తీసుకుందన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 24వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలన్నారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు రాగిజావ అందజేయాలన్నారు. 11.30 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్న భోజనం పెట్టాలని సూచించారు.

ఎర్రబంగారంపై.. మమకారం

మార్కెట్లో మంచి ధర లభిస్తుండటంతో మిర్చి సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎర్రబంగారంగా పిలిచే మిరప సాగు జిల్లాలో ఊపందుకుంటోంది. ఆశించిన దిగుబడులు వస్తుండటం, ధర గిట్టుబాటు అవుతుండడం రైతులకు కలసి వస్తోంది. ఈ ఏడాది పంటసాగుకు అవసరమైన విత్తనాలను సమకూర్చుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.





పూలకుంట వద్ద మిరపకాయలను తొలగిస్తున్న కూలీలు (ఫైల్)

- ఏటా పెరుగుతున్న మిర్చి సాగు విస్తీర్ణం
- మార్కెట్లో విత్తనాలకు పెరిగిన డిమాండ్
- సింజెంటా కిలో రూ.1.30 లక్షల నుంచి రూ.1.50 లక్షలు
- డబ్బి రకం కిలో రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పై మాటే
- ఆర్‌బీకేల్లో మిరప విత్తనాల సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

రాయదుర్గం: మిరప సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో అత్యధికంగా మిరప సాగు చేసే నియోజకవర్గాల్లో ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలు ముందు వరుసలో ఉన్నాయి. ఎక్కువ మంది రైతులు బళ్లారి, ఆదోని ప్రాంతాల్లో లభించే సింజెంటా రకం విత్తనాలపై ఆధారపడుతున్నారు. డబ్బి రకం మిరప అయితే హుబ్లీ, ధార్వాడ, బళ్లారి ప్రాంతాల్లో రైతులతో నేరుగా కిలో రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అదే డబ్బి రకం మిరప విత్తనం ప్యాకింగ్‌లోనిది అయితే కిలో రూ.6 వేల నుంచి రూ.8వేలకు పైగా ధర పలుకుతోంది. సింజెంటా రకం మిరప విత్తనం అయితే కిలో రూ.1.30 లక్షల నుంచి రూ.1.50 లక్షలు పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేయాలంటే సింజెంటా రకం 100 నుంచి 120 గ్రాములు, డబ్బి విత్తనం అయితే కిలో నాటుకోవాలి. 5 కిలోల మిరపకాయల నుంచి కిలో విత్తనం సమకూరుతుంది.

పెరగనున్న సాగు విస్తీర్ణం..

ఎండు మిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నందున సాగు విస్తీర్ణం ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనకు వచ్చారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో గతేడాది 67 వేల ఎకరాల్లో మిరప పంట సాగులోకి వచ్చినట్టు ఉద్యాన శాఖ అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకర్గాల పరిధిలోనే 44 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగులోకి వచ్చింది. ఎండు మిర్చి క్వింటా రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ధరలు పలకడంతో ఈ ఏడాది అదే ఉత్సాహంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచేలా రైతులు చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 72వేల నుంచి 75 వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోనే 46 వేల ఎకరాలు దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఊళ్లోనే మిరప విత్తనం..

మిర్చి రైతులకు విత్తన కష్టాలు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దళారులు, విత్తన కంపెనీల నుంచి మోసపోకుండా రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా రైతులకు మిర్చి విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ సిద్ధం చేసింది. అర్హత కలిగిన రైతులందరికీ నాన్ సబ్సిడీ కేటగిరీలో పంపిణీ చేసేలా కసరత్తు చేపట్టింది. ఇప్పటికే పలు విత్తన కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

పదెకరాల్లో సాగుకు సిద్ధం



గతేడాది నాలుగు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసి 60 క్వింటాళ్ల దిగుబడి సాధించాను. ఎండు మిర్చి క్వింటా రూ.48 వేలతో అమ్ముడుపోవడం వల్ల రూ.28 లక్షలు చేతికి వచ్చింది. ఈ ఏడాది పది ఎకరాల్లో మిర్చి పంట సాగు కోసం నేలను సిద్ధం చేశాను.

– మంజునాథరెడ్డి, రైతు, రంగసముద్రం

మిరప ధర బాగుంది



గతేడాది మూడెకరాల్లో మిర్చి సాగు చేశాను. రూ.8 లక్షల వరకు చేతికందింది. ఈ ఏడాది అదే ఉత్సాహంతో 8 ఎకరాల్లో సాగు చేపట్టేందుకు రెడీ అయ్యాను. సింజెంటా రకం విత్తనం వేయాలనుకుంటున్నా.

– బోయ గోవిందు, రైతు, రంగసముద్రం

ఆర్బీకేల ద్వారా మిరప విత్తనం



ఆర్బీకేల ద్వారా మిరప విత్తనం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. జిల్లా నుంచి 3,400 కిలోల మిరప విత్తనాలు అవసరమని ఇండెంట్ పంపాం. జూన్ నుంచి ఆగస్టు వరకు సాగుకు అనుకూలం.

– బి.రఘునాథరెడ్డి, డీహెచ్ఓ, అనంతపురం

పవన్‌కళ్యాణ్ ఓ మానసిక రోగి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజం



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: జనసేనాని పవన్ కళ్యాణ్ ఫ్రస్టేషన్‌కు లోనై మానసిక రోగిలా మారి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. జనసేన పార్టీ స్థాపించి పదేళ్లవుతున్నా ఎలాంటి ఎదుగూ బొదుగు లేకపోవడం, ప్రజలు ఆదరించకపోవడం, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుస్తానో.. లేదోనన్న భయం, పార్టీ గుర్తును ఎన్నికల సంఘం రద్దు చేయడం తదితర కారణాలు ఆయన మానసిక రోగానికి కారణమయ్యాయన్నారు. అనంతపురంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకసారి తనకు సీఎం కావడానికి అర్హత లేదని, మరోసారి సీఎం తానేనని ప్రకటిస్తున్న పవన్‌కళ్యాణ్‌ను చూసి జనసైనికులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. సీఎం పదవి బందరు లడ్డు కాదన్నారు. కోట్లాది మంది ప్రజానీకం ఆశీర్వదిస్తేనే ఆ పదవి దక్కుతుందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కాపులు అత్యధికంగా ఉన్న గాజువాక, భీమవరంలోనే పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు ఛీకొట్టారన్నారు. ఈ దెబ్బతో ఎక్కడ నుంచి పోటీ చేయాలో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాడన్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే ప్రజలు..

దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. రూ.2.10 లక్షల కోట్ల లబ్ధిని నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. జగన్ పాలనపై తాము సంతృప్తిగా ఉన్నట్లు గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల ద్వారా ప్రజలు బహిర్గతం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో 24 ఎంపీ స్థానాలు వైఎస్సార్‌సీపీకి వస్తాయని జాతీయ స్థాయి సర్వే సంస్థలు బహిర్గతం చేయడం గమనార్హమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం ఖాయమన్నారు.

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో అనంత సత్తా

వివిధ ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు



ప్రమోద్‌కుమార్‌రెడ్డి (284 ర్యాంకు)



సాకే గౌతంసాయి (348 ర్యాంకు)



జ్యోత్స్న (466 ర్యాంకు)



రేవంత్‌రెడ్డి (916 ర్యాంకు)



ప్రజ్ఞశ్రీ (1,213 ర్యాంకు)



నిఖిల్ అగ్నిహోత్రి (1,552 ర్యాంకు)



సాయి దివ్యనైనా (3,173 ర్యాంకు)



షేక్ జహ్వారా (3,759 ర్యాంకు)



షేక్ ఖాజీ రిజాముఖద్దామ్ (4,995 ర్యాంకు)

రాప్తాడురూరల్/ తాడిపత్రి టౌన్: ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ) అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఈ ఫలితాలు విడుదలయ్యాయి. పలువురు విద్యార్థులు జనరల్‌తో పాటు వివిధ కేటగిరీ ర్యాంకులు సాధించారు. జనరల్ కేటగిరీలో పొన్నతోట ప్రమోద్‌కుమార్ రెడ్డి 284, నగరూరు రేవంత్‌రెడ్డి 916, నిఖిల్ అగ్నిహోత్రి 1,552, షేక్ జహ్వారా 3,759, షేక్ ఖాజీ రిజాముఖద్దామ్ 4,995వ ర్యాంకులు సాధించారు. ఎస్టీ కేటగిరీలో సాకే గౌతం సాయి 348, ఆర్.జ్యోత్స్న 466, ఎస్.రామ్‌చరణ్ 1,360, ఇ.అభిరామ్ 1,367, ఎస్సీ కేటగిరీలో బి.ప్రీతం 2,862, నన్నం సాయి దివ్యనైనా 3,173, జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఎం.ప్రజ్ఞశ్రీ 1,213, వీవీ భవదీప్ 2,749, ఓబీసీ-ఎన్‌సీఎల్ కేటగిరీలో కె.పార్థీప్ 4,671, సిరివెళ్ల ఇందుసాహితి 9,540వ ర్యాంకులు సాధించారు.

నేటి నుంచి 'జోసా' కౌన్సెలింగ్..

ప్రఖ్యాత ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల ప్రవేశాల కోసం జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ) కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. 23 ఐఐటీలు, 32 ఎన్ఐటీలు, 26 ఐఐఐటీల సీట్లను జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు. మన జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఆయా కళాశాలల్లో అడ్మిషన్లు పొందనున్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం

- 'పొదుపు' మహిళలకు సర్కారు తోడ్పాటు
- ఈ ఏడాది రూ.1242.87 కోట్ల రుణ లక్ష్యం
- 2023-24 రుణ ప్రణాళిక రూపకల్పన చేసిన సెర్ప్
- తీసుకునే రుణ మొత్తం ఆదాయ మార్గాల్లోనే పెట్టుబడి పెట్టేలా చర్యలు



పొదుపు సంఘాల మహిళలతో సమావేశమైన దృశ్యం (ఫైల్)

అనంతపురం: స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా మరో రూ.1242.87 కోట్ల రుణాలు నూతనంగా మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) రుణ ప్రణాళికకు రూపకల్పన చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ నాలుగేళ్లలో జిల్లాలోని మహిళా సభ్యులకు రూ.5 వేల కోట్ల రుణాలను ఇచ్చారు. ఈ ఏడాది కూడా జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని 1,24,386 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.886.99 కోట్లు, ఉన్నతి కింద రూ.15 కోట్లు, స్త్రీ నిధి కింద రూ.147 కోట్లు, సేవింగ్స్/సీఐఎఫ్ ద్వారా రూ.194.87 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు జిల్లా, మండల, గ్రామ స్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

శాశ్వత జీవనోపాధులే లక్ష్యం..

బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలిచ్చేందుకు ముందుకొస్తుండగా.. అదే సమయంలో ఈ వ్యవస్థపై గ్రామీణ ప్రాంతాల్లోని 'పొదుపు' మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన పెరిగింది. దీంతో వారిని రేపటి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రక్రియకు జగన్ సర్కారు చర్యలు చేట్టింది. ఇందులో భాగంగా పొదుపు సంఘాల పేరుతో మహిళలు తీసుకునే రుణాలు ఇక నుంచి సాధ్యమైనంత మేర ఆ కుటుంబానికి ప్రతి నెలా స్థిర ఆదాయం వచ్చేలా ప్రణాళిక రచించింది. వివిధ శాశ్వత జీవనోపాధులకు వీలున్న వాటిలో పెట్టుబడి పెట్టేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ ప్రక్రియలో వివిధ కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ పథకాలను ఈ కార్యక్రమాలకు అనుసంధానం చేసుకునేందుకు తోడ్పాటునందిస్తామని అధికారులు తెలిపారు. మరో వైపు సమాజంలో పెరుగుతున్న వ్యాపార అవకాశాలను ఉపయోగించుకుని పేద మహిళలు కూడా స్థిర ఆదాయం పొందేందుకు వీలుగా గ్రామీణ పొదుపు మహిళలందరికీ ఆర్థిక అక్షరాస్యతపై సెర్ప్ శిక్షణకు శ్రీకారం చుట్టింది.

నిలువునా మోసం చేసిన బాబు..

చంద్రబాబు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మహిళలను నిలువునా మోసం చేశాడు. హామీని నమ్మి కంతులు చెల్లించని కారణంగా కుదేలైన పొదుపు సంఘాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఆసరా, సున్నా వడ్డీ పథకం వంటి పథకాల ద్వారా ఊపిరిపోసింది.

పొదుపు సంఘాలకు పుష్కలంగా రుణాలు



పొదుపు మహిళలు రికార్డు స్థాయిలో 99.95 శాత మేర బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లిస్తూ వస్తున్నారు. దీంతో బ్యాంకులు కూడా పొదుపు సంఘాల మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశించిన రూ.1242 కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

ఆశలు భద్రమేనా..?

- తుంగభద్రకు మొదలవ్వని ఇన్‌ఫ్లో
- గతేడాది జూన్‌లో 25.43 టీఎంసీల చేరిక
- నేడు నీరు లేక వెలవెలబోతున్న డ్యాం
- ప్రస్తుతం 4.94 టీఎంసీలు మాత్రమే నిల్వ



నీరు పూర్తిగా అడుగంటిన తుంగభద్ర డ్యాం

అనంతపురం సెంట్రల్: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జీవనాడిగా పేరొందిన తుంగభద్ర జలాశయం నీరు లేక వెలవెలబోతోంది. కర్ణాటకలో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో డ్యాం ఎండిపోతోంది. ఇటీవల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో అధికారులు ఆశాజనకంగా వర్షాలు ఉంటాయని భావించారు. ఆ లెక్కల ప్రకారం ఈ ఏడాది 175 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని, హెచ్చెల్సీకి 26.82 టీఎంసీలు, ఎల్ఎల్‌సీకి 19.811 టీఎంసీల కేటాయింపులు చేశారు. కర్ణాటకకు 114.73 టీఎంసీలు కేటాయించారు. ముందుగానే నీరు విడుదల కావచ్చని సూచన ప్రాయంగా తెలియజేశారు. జిల్లాలోని జలాశయాల్లో కొద్దిపాటి నీళ్లు ఉండడం వలన ఆయకట్టుకు అనువైన సమయంలోనే నీటిని విడుదల చేయడానికి అధికారులు సన్నద్ధంగా ఉన్నారు. అయితే నైరుతి రుతుపవనాల ఆలస్యం కారణంగా జిల్లాలోనే కాకుండా కర్ణాటకలో కూడా పెద్దగా వర్షాలు కురవలేదు. ఫలితంగా తుంగభద్ర జలాశయం గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తిగా ఎండిపోయే దశకు చేరుకుంది.

జూలై, ఆగస్టులోనే నీరు..

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో లెక్కలు పరిగణనలోకి తీసుకుంటే ఎక్కువశాతం జూలై, ఆగస్టులోనే వర్షాలు వస్తున్నాయి. రెండేళ్లకోసారి మాత్రమే జూన్‌లో అధికవర్షాలు వచ్చాయి. 12 సంవత్సరాల సగటు లెక్కలను విశ్లేషిస్తే జూన్‌లో 12.79 టీఎంసీలు మాత్రమే చేరుతున్నాయి. అయితే గతేడాది 25.43 టీఎంసీలు రాగా ఇప్పటి వరకూ ఇన్‌ఫ్లో ప్రారంభమే కాకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో నీటి విడుదల ఆలస్యం కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా జలాశయంలో 35 టీఎంసీల నిల్వ తర్వాత నీటి విడుదల ప్రారంభమవుతుంది. ఇదిలా ఉంటే జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే తుంగభద్రకు వరద పోటెత్తుతోంది. సగటున జూలైలో 69.05 టీఎంసీలు, ఆగస్టులో 99.40 టీఎంసీలు వస్తున్నాయి. గతేడాది జూలైలో భారీ వర్షాలు రావడంతో ఏకంగా 109 టీఎంసీలు నీళ్లు వచ్చాయి. దీంతో వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలేశారు. దాదాపు నెలల పాటు నీరు దిగువకు వెళ్లిపోయింది. అయితే ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన అటు అధికారులు, ఇటు రైతుల్లో వ్యక్తమవుతోంది.

టీబీ డ్యాంకు నీటి చేరిక ఇలా (టీఎంసీల్లో)

సంవత్సరం	జూన్	జూలై	ఆగస్టు
2018-19	32.40	121.74	167.73
2019-20	0.00	28.62	172.43
2020-21	4.93	32.50	114.50
2021-22	25.43	109.28	67.20
గత 12 ఏళ్లలో సగటు	12.79	69.05	99.40

నీటి విడుదల ఆలస్యం కావొచ్చు

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో ప్రారంభం కాలేదు. నైరుతి రుతుపవనాల ఆలస్యం కారణంగా కర్ణాటకలో కూడా వర్షాలు రాలేదు. జూలైలోనే జలాశయం నిండుతుందని భావించి ఇటీవల బోర్డు మొదటి సమావేశం జరుపుకొని నీటి కేటాయింపులు చేశాం. త్వరలో వర్షాలు ఉంటాయని చెబుతున్నారు. వర్షాలు ఆశాజనకంగా వస్తే సకాలంలో నీటిని తీసుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్.రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్



జూదరులను అరెస్ట్ చూపుతున్న కూడేరు పోలీసులు

బెళుగుప్ప/కూడేరు: ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని బెళుగుప్ప, కూడేరు మండలాల్లో ఆదివారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పలువురు పేకాటరాయుళ్లు పట్టుపడ్డారు. శనివారం రాత్రి బెళుగుప్ప మండలం గంగవరం పొలాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణయ్య, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన పలువురు అక్కడి నుంచి పారిపోగా ముగ్గురు పట్టుబడ్డారు. మూడు సెల్‌ఫోన్లు, రూ.56,500 నగదు స్వాధీనం చేసుకుని మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. పరారీలో ఉన్న ఏడుగురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే కూడేరు మండలం గొటుకూరుకు చెందిన మహమ్మద్ రఫీ తన ఇంటినే పేకాట స్థావరంగా మార్చినట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతూ అనంతపురానికి చెందిన 11 మంది పట్టుబడ్డారు. రూ.16,440 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రెండు ఆటోలు, స్కూటీలను సీజ్ చేశారు. ఈ రెండు కేసుల్లో జూదరులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఆర్ట్స్ కళాశాల కీర్తి.. ప్రపంచ వ్యాప్తి

- 27 మేజర్, 54 మైనర్ కోర్సులు
- రాష్ట్రంలోనే అత్యధిక కోర్సులు కలిగిన ఏకైక కళాశాలగా గుర్తింపు
- 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం



ఆర్ట్స్ కళాశాల ముఖద్వారం

రాప్తాడు రూరల్: వందేళ్ల ఘనమైన చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాల కీర్తి ప్రపంచ నలుమూలలా వ్యాప్తి చెందింది. కళాశాల ప్రారంభమైన 1916 తొలినాళ్లలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యాపకుడిగా పని చేశారు. ఆ తర్వాత ఆయన రాష్ట్రపతి అయ్యారు. అలాగే ఇక్కడ చదువుకున్న ఎంతో మంది అత్యున్నతస్థాయికి ఎదిగారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య, ఆర్‌బీఐ గవర్నర్ వేణుగోపాలరెడ్డి, ప్రముఖ శాస్త్రవేత్త యూఆర్ రావు, ఐపీఎస్ జేవీ రాముడు, ఐఏఎస్ లక్ష్మీనారాయణ, ఐఆర్ఎస్ నరసింహప్ప, తెలంగాణ విశ్రాంత డీజీపీ ఏకే ఖాన్ ఈ కళాశాల పూర్వ విద్యార్థులు కావడం గమనార్హం. ఇక్కడ చదువుకున్న వారిలో చాలా మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎదిగారు. ఎంతోమంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. 27 మేజర్ కోర్సులు, 54 మైనర్ కోర్సులను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రంలోనే అత్యధిక కోర్సులు కలిగిన ఏకైక కళాశాలగా గుర్తింపు పొందింది.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ..

అత్యున్నత జ్ఞాన శిఖరంలా ఎదిగిన అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ నెల 19 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు కళాశాల యాజమాన్యం అవకాశం కల్పించింది. అత్యంత అనుభవజ్ఞులు, అత్యున్నత విద్యార్హత కల్గిన అధ్యాపకులు ఉండడంతో కళాశాల ప్రారంభం నాటి నుంచి నేటి వరకూ ఎంతో మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. రాయలసీమలోనే అతిపెద్ద గ్రంథాయం ఈ కళాశాలలోనే ఉంది. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు ఏటా జాతీయ దినోత్సవాల్లో ప్రాతినిథ్యం వహిస్తున్నారు. సువిశాలమైన క్రీడా మైదానం, అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులూ ఉన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా నిరంతర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. ఈ కళాశాలలో స్పానిష్ వంటి అంతర్జాతీయ భాషలనూ నేర్పిస్తున్నారు.

అందుబాటులో ఉన్న కోర్సులు..

- **ఆర్ట్స్:** హిస్టరీ, ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంగ్లిష్ లిటరేచర్, తెలుగు లిటరచేర్, హిందీ లిటరేచర్, మీడియా స్టడీస్. కామర్స్‌లో... బీకామ్ జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, డిజిటల్ మార్కెటింగ్, బీబీఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్.
- **సైన్స్:** బీఎస్సీ మ్యాథ్స్, కంప్యూటేషనల్ మ్యాథ్స్, ఫిజిక్స్, అప్లైడ్ ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, బీఎస్సీ ఆర్గానిక్, ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, అప్లైడ్ ప్లాంట్ సైన్సెస్, జువాలజీ, అప్లైడ్ జువాలజీ, మైక్రోబయాలజీ, జియాలజీ, ఎలక్ట్రానిక్స్.

విద్యార్థుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రం..

ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ కోరుకుంటున్న ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలో ఉచ్చులో చిక్కకుండా, ప్రైవేట్ నెట్ సెంటర్ల నిర్వాహకుల మాయలో పడకుండా ఉండేలా ఈ సహాయ కేంద్రం విద్యార్థులను చైతన్య పరుస్తోంది. ఈ కేంద్రం ద్వారా అడ్మిషన్ పొందేందుకు ఉచితంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఆర్ట్స్ కళాశాలలో చదువుకోవడం నిజంగా అదృష్టమే. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతోంది. ఈ అవకాశాన్ని ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్

ఆర్యవైశ్య సంఘం నాయకుడి దుర్మరణం



జయం పురుషోత్తం (ఫైల్)

కళ్యాణదుర్గం: వైఎస్సార్ జిల్లా రాజంపేట వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు జయం పురుషోత్తం (52) దుర్మరణం పాలయ్యారు. తన కుటుంబసభ్యులతో కలసి శనివారం కళ్యాణదుర్గం నుంచి తిరుమలకు కారులో ఆయన బయలుదేరారు. సాయంత్రం కడపలోని దేవుని గడపను దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుమలకు వెళ్తుండగా రాజంపేట మండలం రెడ్డిపల్లి చెరువు వద్ద రాత్రి 10.39 గంటలకు కారు టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ మారుస్తుంటే పురుషోత్తం తన సెల్‌ఫోన్ లైట్ వేసి పట్టుకున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన కంటైనర్ ఢీకొనడంతో పురుషోత్తం అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న కుటుంబ సభ్యులందరూ క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఆయన సోదరులు కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, జయం జువెలరీ అధినేత జయం విశ్వనాథ్ రాత్రికిరాత్రే సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పురుషోత్తం అకాల మృతి పట్ల కళ్యాణదుర్గం ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం కళ్యాణదుర్గంలోని దుకాణాలను స్వచ్ఛందంగా మూసి సంతాపం వ్యక్తం చేశారు.

పెట్రోల్ దాడి ఘటనలో ఒకరి మృతి

- దండించినందుకే దంపతులపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తోడల్లుడు



నల్లపురెడ్డి (ఫైల్)

తాడిపత్రి: శనివారం రాత్రి తాడిపత్రి పరిధిలోని చుక్కలూరు పారిశ్రామిక వాడలో పెట్రోల్ దాడికి గురైన దంపతుల్లో భర్త నల్లపురెడ్డి (42) ఆదివారం రాత్రి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య తెలిపారు. ఘటనకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసిన అంశాలను ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. చుక్కలూరు పారిశ్రామిక వాడలోని శ్రీనిధి నల్ల బండల పాలిష్ పరిశ్రమలో నల్లపురెడ్డి, కృష్ణవేణి దంపతులపై శనివారం అర్ధరాత్రి పెట్రోల్ దాడి విషయం తెలిసిందే. కృష్ణవేణి చెల్లెలు సునీత భర్త రమేష్‌రెడ్డినే ఈ ఘటనకు కారకుడని తేలింది. పనీపాట లేకుండా మద్యం మత్తులో జులాయిగా తిరిగే రమేష్‌రెడ్డి తరచూ భార్యతో గొడవపడేవాడు. నాలుగు రోజుల క్రితం బండల పరిశ్రమలోనే ఉంటున్న సునీతతో రమేష్‌రెడ్డి తీవ్రంగా ఘర్షణ పడ్డాడు. ఆ సమయంలో అక్క కృష్ణవేణి, బావ నల్లపురెడ్డి జోక్యం చేసుకుని రమేష్‌రెడ్డిని పద్ధతి బాగోలేదని దండించారు. భార్య సునీత సైతం రమేష్‌రెడ్డిని తన వద్దకు రావొద్దని, ఎక్కడికైనా వెళ్లాలంటూ ఇంటి తలుపులు మూసేసింది. అప్పటి నుంచి నల్లపురెడ్డి, కృష్ణవేణిపై కక్ష పెంచుకున్న రమేష్‌రెడ్డి శనివారం అర్ధరాత్రి గాఢనిద్రలో ఉన్న వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు.వారికి సమీపంలోనే నిద్రిస్తున్న మరో బాలిక పూజిత సైతం మంటల్లో గాయపడింది. మంటలు గమనించిన చుట్టుపక్కల వారు అటుగా వస్తుండడం గమనించిన రమేష్‌రెడ్డి అక్కడి నుంచి పరారయ్యాడు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లపురెడ్డి మృతి చెందగా, ఆయన భార్య అక్కడే చికిత్స పొందుతోంది. నల్లపురెడ్డికి ఇద్దరు కుమారులున్నారు.

బాలయ్య అభిమానుల అత్యుత్సాహం...

వీధిన పడ్డ కుటుంబం

- బాలకృష్ణ కటౌట్ పడి తల్లీబిడ్డకు గాయాలు
- న్యాయం కోరుతున్న బాధితులు



గాయపడిన చంద్రకళ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భారీ కటౌట్ పడి తల్లీబిడ్డ గాయపడ్డారు. విషయాన్ని గమనించిన అభిమానులు ఆదుకుంటామని చెప్పి చేతులెత్తేశారు. వివరాలు.. అనంతపురంలోని హౌసింగ్‌బోర్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నివాసముంటున్న వృద్ధ దంపతులు రామచంద్ర, వెంకటలక్ష్మికి ఇద్దరు కుమారులు రాఘవేంద్ర (బుద్ధి మాంద్యం), రాంప్రసాద్, ఇద్దరు కుమార్తెలు జయలక్ష్మి (బుద్ధి మాంద్యం) చంద్రకళ ఉన్నారు. చిన్నపాటి పనులతో కుటుంబానికి చేదోడుగా చంద్రకళ నిలిచింది. ఇంట్లో మంచానపడిన ముగ్గురికి తల్లి సేవలందిస్తుండగా రాంప్రసాద్ పగలంతా తిరిగి అగరుబత్తీలు అమ్మినా రోజుకు వందకు మించి ఆదాయం ఉండడం లేదు. అతనికి కూడా కాళ్లు సరిగా లేవు. దీంతో కుటుంబం మొత్తం చంద్రకళ సంపాదనపైనే ఆధారపడింది.

విషాదం నింపిన బాలయ్య పుట్టిన రోజు..

ఈ నెల 10న నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని అనంతపురంలోని టవర్ క్లాక్ సమీపంలో బాలయ్య అభిమానులు భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అదే రోజు సాయంత్రం అటుగా వెళుతున్న వెంకటలక్ష్మి, చంద్రకళపై కటౌట్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఘటనలో చంద్రకళ నోట్లోకి కటౌట్‌కు ఏర్పాటు చేసిన వెదురు కర్ర దూసుకుపోయింది. తల్లికీ తీవ్ర గాయమైంది. అక్కడున్న వారు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. చంద్రకళకు శస్త్రచికిత్స చేసి వెదురు కర్రను వైద్యులు తొలగించారు. ఆ సమయంలో ఆమె పళ్లను పూర్తిగా తొలగించి కుట్లు వేశారు. దాదాపు నెలరోజుల పాటు కుట్లు తీయడానికి వీల్లేదని వైద్యులు తెలిపారు.

న్యాయం చేయండి



జరిగిన అన్యాయానికి మేము ఆర్థిక సాయం కోరడం లేదు. న్యాయం చేయాలని కోరాం. ఆపరేషన్ చేయించుకున్న చెల్లెలు ఎనిమిది రోజులుగా నోరు మెదపలేకపోతోంది. మరో 25 రోజులు ఇదే పరిస్థితి అని డాక్టర్లు చెప్పారు. అన్నం.. నీరు అన్నీ పైప్ ద్వారానే అందజేస్తున్నాం. అమ్మ గొంతుకూ తీవ్రగాయమై మంచం పట్టింది. చెల్లి, అన్న బుద్ధిమాంద్యులు, చాలా రోజులుగా అనారోగ్యంతో తండ్రి కూడా మంచాన పడ్డాడు. ఇంత మందిని చూసుకోవడం ప్రస్తుతం నావల్ల కావడం లేదు. దయ చేసి మాకు న్యాయం చేయండి. – రాంప్రసాద్, బాధితురాలి అన్న, అనంతపురం

వ్యాపారి అనుమానాస్పద మృతి



మహానంద (ఫైల్)

ఉరవకొండ: స్థానిక డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్న చిరువ్యాపారి అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమార్తెలు మల్లిక, వాణి ఫిర్యాదు మేరకు ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చిరువ్యాపారి మహానంద (55), అనురాధ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం అనురాధ మృతి చెందడంతో మహేశ్వరిని రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు ఐదేళ్ల కుమార్తె ఉంది. కొంత కాలంగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మహానంద తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న మహానందను గమనించిన భార్య వెంటనే ఇరుగుపొరుగు వారి సాయంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మొదటి భార్య కుమార్తెలు ఫిర్యాదు ఇవ్వడంతో ఆ దిశగా కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతుడు నాగరాజు

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లికి చెందిన నాగరాజు(52) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు... శనివారం సాయంత్రం చెరువు పక్కన బహిర్భూమికి వెళ్లిన అనంతరం శుభ్రం చేసుకునేందుకు చెరువులో దిగిన నాగరాజు అదుపు తప్పి నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీట మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శనివారం రాత్రంతా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం మధ్యాహ్నం నీటిపై తేలుతున్న నాగరాజు మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అతిసారంతో వివాహిత మృతి

- గ్రామాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ



కవిత (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో అతిసార వ్యాధి విజృంభించింది. ఆదివారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన కవిత అలియాస్ శాంతమ్మ (26) వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మృతిచెందింది. మూడు రోజుల క్రితం ఒకే కుటుంబానికి చెందిన నాగన్నగౌడ్, సుధాకర్, కవిత, మణికంఠ తీవ్ర అస్వస్థతకు లోనై చికిత్స కోసం బళ్లారిలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో చేరారు. నాగన్న గౌడ్, సుధాకర్, మణికంఠ శనివారం డిశ్చార్జ్ అయ్యారు. పరిస్థితి విషమంగా ఉన్న కవిత చికిత్సకు స్పందించక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్త కురుబ రుద్రగౌడ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డివిజినల్ వైద్యాధికారి సుజాత ఆదివారం బొల్లనగుడ్డంలో పర్యటించారు. బళ్లారి, రూపనగుడి, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 15 మంది బాధితులతో మాట్లాడారు. ఐదు రోజులుగా తీసుకున్న ఆహారం, తాగునీటిపై ఆరా తీశారు. అతిసార ప్రబలడానికి నీరే కారణమంటూ బళ్లారిలోని వైద్యులు తెలిపినట్లు డాక్టర్ వీరబ్బాయి స్పష్టం చేశారు. గ్రామంలో వారం రోజుల పాటు వైద్య శిబిరం కొనసాగిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, సుల్తానా, ఏఎన్ఎం గోవర్ధన, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌లైన్ తాత్కాలిక సిబ్బంది నియామకానికి నేడు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్: చైల్డ్‌లైన్ ఇండియా ఫౌండేషన్, అనుబంధ స్వచ్ఛంద సంస్థలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం సోమవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో చైల్డ్‌లైన్ సేవలకు అంతరాయం కలగకుండా రెండు నెలల కాలానికి 8 మంది ఉద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

సాయంత్రంలోపు పురస్కారాలు అందజేయాలి

రాప్తాడురూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల స్థాయిలో 'జగనన్న ఆణిముత్యాలు'కు ఎంపిక చేసిన విద్యార్థులకు సోమవారం సాయంత్రంలోగా పురస్కారాలు అందజేయాలని డీఈఓ ఎం.సాయిరామ్ ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 336 మంది విద్యార్థులను పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. సాయంత్రంలోపు పురస్కారాలు అందజేసి వివరాలు డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే హెచ్ఎంలు, ఎంఈఓలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నలుగురిపై కేసు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు తుమ్మల వంశీ (47) ఆత్మహత్యకు కారకులైన తిమ్మాపురం బుల్లెట్ బాబా, సర్దార్, కాశీంతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విష్ణుతేజపై 306 సెక్షన్ కింద వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 20 ఏళ్ల కిందట కురుగుంట సర్వే నంబరు 102–1బీలో 5.68 ఎకరాల భూమిని వంశీ కొనుగోలు చేసి తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే ఈ భూమిని రౌడీషీటర్లు బుల్లెట్‌బాబా, సర్దార్‌తో పాటు ఖాశీం ఇటీవల కబ్జా చేశారు. ఈ వ్యవహారంలో అధికారులు కూడా తనకు సహకరించలేదని వంశీ సూసైడ్ నోట్ రాసి ఈ నెల 16న తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో పోలీసులు నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేశారు. శనివారమే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆదివారం ఆర్ఐను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది.

మళ్లీ తెగిపడిన విద్యుత్ లైన్



మృతి చెందిన పెంపుడు కుక్క

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో తరచూ విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. ఏడు మాసాల క్రితం కూలీలపై విద్యుత్ తీగ తెగిపడిన ఘటనలో ఏకంగా ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. మరోఘటనలో మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన మహిళా రైతు వాణి సైతం తెగిపడిన విద్యుత్ వైర్‌ను గమనించకుండా దానిపై కాలు పెట్టడంతో షాక్‌కు గురై మృతి చెందింది. తాజాగా ఆదివారం గ్రామ శివారులోని రైతులు మురుడప్ప, బలిజ బొగ్గప్పకు చెందిన పొలాల్లో 32 కేవీ విద్యుత్ లైన్ తెగిపడి పెంచుకున్న కాపలా కుక్కలు మృత్యువాతపడ్డాయి. కుక్కల కళేబరాలను గమనించిన రైతులు వెంటనే అప్రమత్తమై కూలీలను అటుగా కాలు పెట్టనివ్వలేదు. విద్యుత్ లైన్‌కు ఏర్పాటు చేసిన కండక్టర్ చాలా అధ్వానంగా ఉందంటూ పలుమార్లు తాము అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మరోసారి ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరా.. నమోనమః



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర నమోనమః అంటూ ఆదివారం స్వామి వారి నామస్మరణ మార్మోగింది. ఉదయాన్నే మంగళ స్నానాల అనంతరం స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, పల్లకీసేవ, తదితర పూజలు నిర్వహించారు. దోష నివారణకు భక్తులు ఆలయ ప్రాంగణంలో భక్తులు రాహు కేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీ మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కోటంకలో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కాల భైరవుడు

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురంలోని కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో ఉదయాన్నే ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి కూష్మాండ దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించింది.

ఎంఈఓలను యథాతథంగా కొనసాగించాలి

రాప్తాదురూరల్: ప్రస్తుతం పని చేస్తున్న ఎంఈఓ-1లను యథాతథంగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సైన్స్ సెంటర్‌లో డీఈఓ సాయిరామ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఎస్. సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ జి.లింగమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈఓలందరూ యథాతథ స్థానాల్లోనే కొనసాగించాలన్నారు. ఫ్యాప్టో నాయకులు బి.నరసింహులు, కులశేఖర్ రెడ్డి, సత్యసాయి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె. శ్రీనివాసులు, కోచైర్మన్ పురుషోత్తం, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రమణారెడ్డి, గోవిందరాజులు, శ్రీనివాస రెడ్డి, నాగేంద్ర, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాకేష్ మాస్టర్ మృతి బాధాకరం



రాకేష్ మాస్టర్‌తో అనంత డాన్స్‌మాస్టర్ సురేష్

అనంతపురం కల్చరల్: ప్రముఖ కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్ మృతి బాధాకరమని అనంత డాన్సు మాస్టర్స్ అసోసియేషన్ ఆదివారం ప్రగాఢ సంతాపం తెలిపింది. నగరానికి చెందిన నాట్యాచార్యులు సురేష్‌తో రాకేష్ మాస్టార్‌కు 30 ఏళ్ల అనుబంధం ఉంది. రాకేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన అనేక సినిమాలు జనాదరణ పొందాయని , ఆయన పేరిట చిన్నారులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని అసోసియేషన్ తీర్మానించినట్లు సురేష్ మాస్టర్ తెలిపారు. రాకేష్ మాస్టర్‌తో కలిసి వేదికలెన్నో పంచుకున్నామని, శేఖర్ మాస్టర్ లాంటి దిగ్గజాన్ని చిత్రసీమకు పరిచయం చేసిన ఆయనకు నివాళిగా త్వరలో అందరం కలిసి సంతాప సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పూలతోట...లాభాల బాట

- కాసులు కురిపిస్తున్న మల్లె పూలు
- పూలతోటల సాగుపై అబ్బేదొడ్డి రైతుల ఆసక్తి

గుత్తి రూరల్: రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. మూడేళ్లుగా వర్షాలు బాగా కురిసి బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో రైతులు పూల తోటలు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. సంప్రదాయ పంటలు సాగు చేసి ఏటా నష్టాలు వస్తుండటంతో గ్రామంలో సుమారు 40 మంది రైతులు గుండు మల్లె, మల్లె, జాజి పూల పంటలు సాగు చేస్తూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

210 ఎకరాల్లో సాగు..

రైతులు తమకున్న పొలంలో 20 సెంట్ల నుంచి అర ఎకరం భూమిలో పూల తోటలు సాగు చేస్తున్నారు. గ్రామంలో 210 ఎకరాల విస్తీర్ణంలో పూల తోటలు రైతులు సాగు చేశారు. పూల మొక్కలకు సంబంధించిన నారును రైతులే సిద్ధం చేసుకొని పొలాల్లో నాటుతారు. మొక్కలు నాటిన దగ్గర నుంచి నీరు పెట్టి కంటికి రెప్పలా కాపాడుతారు. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు పూల తోటలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో నలుగురు రైతులు పూల తోటలు సాగు చేశారు. ఉపాధి హామీ కింద పూల తోటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం పొలం కంచె, ఎరువు, మొక్కలకు నీటి తడులు ఇచ్చేందుకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఇక గ్రామంలో సొంతంగా పొలాలు లేని రైతులు, ఇతర పంటలు సాగు చేసే రైతులు ఇంటి ఆవరణ, కల్లాలలో సైతం పూల మొక్కలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



అబ్బేదొడ్డిలో సాగు చేసిన పూలతోట

8 నెలల పాటు పూల దిగుబడి..

మొక్కలు నాటిన అనంతరం ఏడాది నుంచి పూలు కోతకు వస్తాయి. మార్చి నుంచి అక్టోబర్ వరకూ 8 నెలల పాటు రోజు పూల కోతలు ఉంటాయని రైతులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో రోజుకు 8 కిలోలు దిగుబడి రాగా జూన్ నుంచి అక్టోబర్ వరకూ రోజూ 15 కిలోల వరకూ దిగుబడి వస్తుందని రైతులు చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో జాస్మిన్ పూలు రూ.300 వరకూ పలుకుతున్నాయి. ప్రతి రోజు ఎనిమిది కిలోలు కోత కోసి మార్కెట్‌కు తరలిస్తే రూ.2,400 రాగా, కూలీ ఖర్చులు, రవాణాకు రూ.వెయ్యి పోగా రైతుకు రోజూ 1,400 ఆదాయం లభిస్తుంది. మొక్కల నాటిన ఐదేళ్ల తరువాత రోజూ 15 కిలోల దిగుబడి వస్తుంది. తద్వారా రోజుకు రూ.4,500 నికర ఆదాయం వస్తుంది. కూలీ, ఎరువు, రవాణా రూ.2 వేలు పోగా రోజుకు రైతుకు రూ.2,500 మిగులుతుంది. అలా 8 నెలలకు రైతుకు రూ.6 లక్షల వరకూ ఆదాయం వస్తున్నట్లు రైతులు చెప్పారు.

25 సెంట్లలో మల్లెపూల సాగు చేశా



నాకున్న పొలంలో నుంచి 25 సెంట్లలో ఉపాధి హామీ కింద ప్రభుత్వ సహకారంతో 400 మొక్కలను పెట్టాను. గతంలో సంప్రదాయ పంటలతో పాటుగా చీని మొక్కలు సాగుచేసి నష్టాలు చూసాను. పూల తోట సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. రోజూ రూ.వెయ్యికి పైగా ఆదాయం వస్తోంది.

– రామకృష్ణారెడ్డి, రైతు, అబ్బేదొడ్డి, గుత్తి మండలం

పూల తోటలకు కేరాఫ్‌గా అబ్బేదొడ్డి



అబ్బేదొడ్డి గ్రామం పూల తోటలకు కేరాఫ్‌గా మారి రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది. అమరావతి ఉన్నతాధికారులు సైతం గ్రామ రైతులకు ప్రశంసించారు. మార్కెట్‌లో పూలకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులు ఫ్లోరీ కల్చర్ కింద పూల తోటలు సాగు చేసి ఆర్థికంగా ఎదిగారు. గ్రామం ప్రారంభం నుంచి ఎటుచూసినా పూల మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

– ఆదినారాయణ, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్, గుత్తి

సేవా దృక్పథం అభినందనీయం

అనంతపురం క్రైం: సేవా దృక్పథం అభినందనీయమని మాజీ మేయర్ రాగే పరుశురాం తెలిపారు. ఆదివారం ఏడో డివిజన్‌లోని నీరుగంటి వీధిలో ఆదిత్య హాస్పిటల్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్థానికంగా ఉండే వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సమస్య ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ నాగమణి, రవికాంత్ కాటర్స్ రమణ, వైద్యులు డాక్టర్ రాజశేఖర్ స్వరూప్, సభ్యులు అశ్వత్ కుమార్, లీలావతి, నజీర్, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

సంతల ద్వారా రూ.4.42 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈవారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.42 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,42,165 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ. 2,40,300 వసూలైనట్లు తెలిపారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మాజీ సైనికులకు భూమి కేటాయించాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలోని మాజీ సైనికులకు ప్రభుత్వం భూమి కేటాయించాలని మాజీ సైనిక సంఘం నేతలు కోరారు. ఆదివారం స్థానిక వీకే భవన్‌లో సమావేశం నిర్వహించారు. మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు షేకన్న మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మాజీ సైనికులకు రావాల్సిన ఫలాలను ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

అనంతపురం క్రైం: బదిలీలు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖలో పని చేస్తున్న డ్రైవర్లు లక్ష్మన్న, బాలరాజు, భాస్కర్ తదితరులు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయిని కోరారు. ఈ మేరకు ఆదివారం వారు డీఎంహెచ్ఓకు ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కొందరు డ్రైవర్లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు అసోసియేషన్లలో ఉన్నట్లు నమోదు చేశారని, ఇలాంటి దరఖాస్తులను విచారించి పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని కోరారు.

అతివలు మెచ్చే ఆషాఢం ఆరంభం

- నేడు ప్రారంభం కానున్న సంప్రదాయ మాసం
- మరో రెండు నెలలు నుమూహూర్తాల్లేవ్

అనంతపురం కల్చరల్: అమావాస్య ఆదివారంతో జ్యేష్ఠమాసం ముగిసి సోమవారం నుంచి ఆషాఢం ప్రారంభం కానుంది. సహజంగానే ఆషాఢంలో సంప్రదాయాలు అధికంగా పాటిస్తారు. చాతుర్మాస్య దీక్షలు, దేవీ నవరాత్రులు, ఏడు శనివారాల వ్రతాలు, వ్యాసపౌర్ణిమ వేడుకలతో మాసమంతా వైరాగ్య స్థితికి తెస్తుంది. జూన్ 18 నుంచి జూలై 17 వరకు ఆషాఢమాసం ఉంటుంది. ఆషాఢ మాసంలో (జూలై 3న వచ్చే) గురుపౌర్ణిమ మినహా ప్రధాన పండుగలేవీ లేనప్పటికీ ఆలయాల్లో ప్రత్యేకించి అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరుగుతాయి. నగరంలోని వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక వేడుకలకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా గోరింటాకు పెట్టుకునే సంప్రదాయానికి ఈ మాసంలో ప్రాధాన్యం ఉంటుంది. కొత్తగా పెళ్లయిన వారు అత్తగారింట్లో ఉండే అవకాశం లేనందున అమ్మనాన్నల వద్ద గడిపే నెల రోజుల కోసం అతివలు ఈ మాసాన్ని ఇష్టపడతారు.

అధిక శ్రావణం రానుండడంతో ముహూర్తాలంతంతే :

సాధారణంగా మాసం మారుతోందంటే జీవన విధానంలోనూ మార్పులొస్తాయి. పండుగలు, పర్వదినాలు లేనట్టే ఆషాఢంలో సుమూహూర్తాలేవీ పెట్టుకోరు కాబట్టి మళ్లీ మంచి ముహూర్తం కోసం శ్రావణ మాసం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. అయితే ఈసారి ఆషాఢం తర్వాత కూడా అధిక శ్రావణం రానుండడంతో ఈనెలతో పాటు మరో నెలరోజులు ముహూర్తాలు ఉండవు. మళ్లీ ఆగస్టు 15 తర్వాత మాత్రమే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ రెండు నెలలు నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రుల పేరిట ప్రత్యేక పూజలు జరగనున్నాయి.



ఆషాఢంలో పూజలందుకునే అమ్మవారు

అమ్మవారి ఆరాధనతో విశేష ఫలం



సహజంగానే ఆషాఢ మాసం వస్తోందంటే పురోహితులకు పెద్దగా పని దొరకదు. శ్రావణమంతా సందడిగా ఉంటుంది. ఈసారి ఆషాఢం తర్వాత కూడా అధిక శ్రావణం వస్తుండడంతో రెండు నెలల పాటు పెళ్లిళ్ల ముహూర్తాలేవీ లేవు. అమ్మవారి పూజలతో అందరి మనసు ప్రశాంతంగా ఉండే అవకాశం ఆషాఢం కల్పిస్తుంది. ముఖ్యంగా శాకంబరీ అలంకారం ఈ మాసానికే ప్రత్యేకం. విశేష ఫలితానిచ్చే దాన ధర్మాలకు కూడా ఈమాసం శుభప్రదం.

– రాఘవేంద్ర ప్రసాద శర్మ , పురోహితులు, గీతామందిరం

ఎంపీఈవోల కాంట్రాక్టు పీరియడ్ పొడిగించండి

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో 2017 నుంచి క్షేత్ర స్థాయిలో రైతులకు కీలకసేవలు అందిస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈవో)కు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక రూరల్ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎంపీఈవోల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్టు పీరియడ్‌ను పొడిగించి, గత మూడు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఓడీ బేసిస్ కింద చిత్తూరుకు బదిలీ చేసిన వారిని ఇక్కడే 2 వేల ఎకరాలు ఉన్న ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. కనీస వేతనాలు రూ.25 వేలకు తగ్గకుండా ఇవ్వాలని, అన్ని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తరహాలోనే ప్రమాద ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. సచివాలయ, ఆర్‌బీకేల్లో ఖాళీల్లో నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా ఎంపీఈవోలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు కె.రామ్మూర్తి, గంగన్న, సోమశేఖర్, భాగ్యలక్ష్మి, శ్వేత, గీత, అపర్ణ, ప్రశాంతి, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీఈవోల సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకుడు నాగరాజు

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

నార్పల: విద్యార్థులు క్రమశిక్షణ పాటించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందొచ్చని సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మండల కేంద్రంలో శివకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెసిడెన్సియల్ సీట్లు పొందిన విద్యార్థుల అభినందన సభ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగాహాజరై మాట్లాడారు. శివకృష్ణహాదరి శివకృష్ణ ట్రస్ట్ ద్వారా మండల వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు రెసిడెన్షియల్ కోచింగ్ ఉచితంగా అందించి వారి భవిష్యత్తుకు మార్గం చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగరాజు, ట్రస్ట్ ప్రతినిధులు ప్రవీణ్, నాగార్జున, చంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

నెట్టికంటుడికి వెండి తట్ట బహూకరణ



ఆలయ సిబ్బందికి వెండితట్ట అందిస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: కర్నూలుకు చెందిన కీర్తి, లాలిరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి 1.3 కిలోల వెండి తట్టను బహూకరించారు. ఈసందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పేదరిక నిర్మూలనకు ఫాదర్ ఫెర్రర్ కృషి

గార్లదిన్నె: అనంతపురం ఉమ్మడి జిల్లాలో పేదరిక నిర్మూలనకు ఫాదర్ ఫెర్రర్ ఎనలేని కృషి చేశారని ఏఎస్ఐ గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి పురస్కరించుకొని ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో 600 కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు.మొదటగా ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ ఆర్డీటీని స్థాపించి పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం, ఉచిత గృహాలు, మహిళా సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, సీఓ వరలక్ష్మి, అనిత, సీబీటీ నందిని, సీడీసీ మెంబర్లు కదిరెప్ప, దేవదత్తు, బాలనాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముగిసిన వైఎస్సార్ క్రికెట్ టోర్నీ

బుక్కరాయసముద్రం: కొర్రపాడు గ్రామంలో ఆదివారం వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. కొర్రపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో గత నెల 25న వైఎస్సార్ క్రికెట్ టోర్నీని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా నేత విష్ణుతేజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణుతేజ్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి స్ఫూర్తితో ఏటా కొర్రపాడులో వైఎస్సార్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 64 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కొర్రపాడు, నార్పల జట్లు తలపడ్డాయి. నార్పల జట్టు 16 ఓవర్లలో 119 పరుగులు చేసింది. కొర్రపాడుకు చెందిన డ్రీమ్ లెవల్ జట్టు 12 ఓవర్లలోనే 120 పరుగులు చేసి విజయం సాధించింది. కొర్రపాడు జట్టుకు రూ.60 వేల నగదు బహుమతితో పాటు కప్, నార్పల జట్టుకు రూ.30 వేల నగదుతో పాటు కప్‌ను విష్ణు తేజ్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న విష్ణుతేజ్ రెడ్డి

జయం పురుషోత్తం మృతి తీరనిలోటు

అనంతపురం కల్చరల్: జిల్లాలోని ఆర్యవైశ్య సంఘానికి ఎనలేని సేవలందించిన జయం పురుషోత్తం మృతి తీరనిలోటు అని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపా మచ్చా నరసింహులు, టంగుటూరు నాగభూషణం, తల్లం మురళీ ఓ ప్రకటనలో జయం పురుషోత్తం మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘానికి అధ్యక్షుడిగా, గౌరవాధ్యక్షుడిగా స్ఫూర్తిదాయక సేవలందించే పురుషోత్తం ఆకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మరణించడం ఆర్యవైశ్య సంఘానికి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఫాదర్స్‌డే ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గుత్తి సీఎస్ఐ డివిజనల్ చైర్మన్, పాస్టర్ రెవరెండ్ జీ డేవిడ్‌నాయక్ ఫాదర్స్‌డే ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఫాదర్స్ సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జకరయ్య, అబ్రహాం, జయరాజు, విజయభాస్కర్, కరుణాకర్, కిష్టఫర్ బాబు, రూఫస్, ప్రసాద్, రజని, సుశీలమ్మ, సావిత్రి, వాణి, మాణిక్యమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డేవిడ్‌నాయక్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పెద్దపప్పూరు: జూటూరులో ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. దళితులకు ఎటువంటి సమస్య వచ్చినా ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంబగిరి రాముడు, పెద్దిరాజు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మందకృష్ణ

వాహనాల బహిరంగ వేలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 20న బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ రవిచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సెబ్ స్టేషన్ ఆవరణలో జరగనున్న బహిరంగ వేలంలో పాల్గొనేవారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

నార్పల: మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణ, సంత మార్కెట్‌లో తదితర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని రోజుల నుంచి రద్దీ ఉన్న ప్రాంతాల్లో మొబైల్ దొంగతనాలు, పిక్‌ప్యాకెటింగ్‌తో పాటు రాత్రి సమయాల్లో ఇంటి బయట ఉన్న వాహనాల్లో పెట్రోల్ చోరీ జరుగుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

21న యోగా దినోత్సవం

పామిడి: పట్టణంలోని సరస్వతీ ఉన్నత విద్యామందిర క్రీడా ప్రాంగణంలో ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్ తిరుపతినాయుడు, యోగా ట్రైనర్ ఎస్ సంధ్యదత్ ఆదివారం తెలిపారు. ఉదయం 6 గంటలకే ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



వరలక్ష్మి

తాడిపత్రి: కడుపు నొప్పి భరించలేక యర్రగుంటపల్లికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వరలక్ష్మి, సుంకన్న దంపతులు కూలీ పనుల ద్వారా జీవనం సాగించేవారు. కొన్నేళ్లుగా వరలక్ష్మి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోయింది. ఆదివారం రాత్రి కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంటిలోని ఎలుకల మందు తినింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పోతలయ్య, చెన్నకేశవస్వామి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాతా పోతలయ్యస్వామి వారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామికి కానుకలు అందించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వాహనాలు తనిఖీ చేస్తున్న సెబ్ పోలీసులకు భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. మద్యం స్వాధీనం చేసుకున్న సెబ్ సీఐ రవిచంద్ర తెలిపిన మేరకు.. ఆదివారం ఉదయం స్థానిక రుద్రంపేట కూడలిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, రెండు ఆటోల్లో కర్ణాటక మద్యం బాక్సుల్లో పట్టుబడింది. మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నాం. రుద్రంపేటకు చెందిన యాగంటి హరిష్, చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన టీ వెంకటేష్ చెరో ఒక ఆటో కర్ణాటకలోని బళ్లారిలో నాలుగు కార్టన్ బాక్సులు కొనుగోలు చేసి, వాటిని ఆటోలోని వెనుక సీటుకింద దాచుకొని ఇక్కడికి తీసుకొచ్చారు. వీరి వద్ద నుంచి మొత్తం 8 బాక్సుల్లో 768 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే 'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మబంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంతకన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?


రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.


వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లులాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!


మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

మా నాన్న సూపర్ హీరో!


సుధీర్‌బాబు


'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?


రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాస్త్రీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాస్త్రీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత


అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

సంక్రాంతికి జాతర


ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.